రికార్డుస్థాయి విద్యుత్తు డిమాండ్

ఒక్కరోజే 15,752 మెగావాట్లుగా నమోదు

హైదరాబాద్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): వేసవికాలం ప్రారంభం లోనే ఎండలు దంచుతున్నాయి. దీని కితోడు విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గురువారం ఒక్కరోజే రికార్డుస్థాయిలో 15,752 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండు నమోదైనట్లు టీజీ ట్రాన్స్‌కో ఎండీ వెల్లడించారు. ఇప్పటివరకూ గత ఏడాది మార్చి 8న నమోదైన 15,623 మెగావాట్ల డిమాండే అత్యధికం కాగా, గురువారం 129 మెగావాట్లు అధికంగా నమోదైనట్టు ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని, గత ఏడాది డిసెంబర్‌లో అంతకుముందు సంవత్సరం డిసెంబర్ నెలతో పోల్చుకుంటే 13.49శాతం, గత ఏడాది జనవరితో పోల్చుకుంటే ఈ ఏడాది జనవరిలో 10.10శాతం పెరుగుదల నమోదైనట్టు చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 17,000 మెగావాట్ల వరకు సరఫరా చేసేందుకు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్‌లు దీర్ఘకాల కాంట్రాక్టుల నుంచే కాకుండా పవర్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి కూడా విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయని టీజీ ట్రాన్స్‌కో ఎండీ తెలిపారు. పవర్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా విద్యుత్ కొనుగోలు వల్ల ఖర్చు తగ్గడంతోపాటు విద్యుత్ లోటును పూడ్చుకోవచ్చని పేర్కొన్నారు.

మండుతున్న ఎండలు

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 10 గంటలకే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రత సగటున 32 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నది. గురువారం ఆదిలాబాద్‌లో 32.8 డిగ్రీలు, భద్రాచలంలో 35.6, హనుమకొండ 34, హైదరాబాద్ 33.5, ఖమ్మం 35.4, మహబూబ్‌నగర్ 35.6, మెదక్ 35.8 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ప్రాణం తీసిన ఇందిరమ్మ ఇండ్ల జాబితా

- ఇల్లు కాలిపోయిందని, తనకు ఇల్లు కేటాయించాలని కోరినా లెక్కచేయని ప్రభుత్వం
- గత నెల గ్రామ సభలో పురుగుల మందు తాగిన దళితుడు నాగయ్య
- ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి
- నాగయ్యది ప్రభుత్వ హత్యే: మాజీమంత్రి ఎర్రబెల్లి
- కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలి: పెద్ది సుదర్శన్‌రెడ్డి



గ్రామసభలో అధికారులతో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు(ఫైల్)

ములుగు, ఫిబ్రవరి 6(నమస్తేతెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల జాబితా ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు లేకపోవడంతో గ్రామసభలో అధికారుల ఎదుటే పురుగులమందు తాగాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం జీపీ పరిధి కొత్తూరుకు చెందిన కుమ్మరి నాగేశ్వరరావు (నాగయ్య) జనవరి 23న నిర్వహించిన గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు రాకపోవడంతో అధికారులను నిలదీశాడు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హుల పేర్లు వచ్చాయని, ఒకే కుటుంబంలో ఇద్దరికి ఎలా వస్తాయని ప్రశ్నించాడు. నిరుడు తన ఇల్లు కాలిపోయిన ఫొటోలను అధికారులకు చూపించారు. తన చావుతోనైనా అర్హులకు పథకాలు ఇవ్వాలని చెప్పి పురుగులమందు తాగాడు. వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: లక్ష్మీనరసింహారావు

బాధిత కటుంబానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి మాట్లాడారు. 15 రోజులుగా మృత్యువుతో పోరాడిన నాగయ్యకు బీఆర్ఎస్ అండగా నిలిచినప్పటికీ ప్రాణాన్ని కాపాడలేకపోయామని విచారణ వ్యక్తంచేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు.

తండ్రి మరణంతో రోడ్డున పడ్డాము: పూజ

తండ్రి మృతితో తాము రోడ్డున పడ్డామని నాగేశ్వరరావు పెద్ద కూతురు పూజ బోరున విలపించింది. తండ్రిని బతికించేందుకు దవాఖాన ఖర్చులకు అప్పులు చేశామని చెప్పారు. బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు(లక్ష్మీనరసింహారావు) ధైర్యం చెప్పి 2.5 లక్షల పైనే సాయం అందించారని తెలిపారు. ఆయన అందుబాటులో లేనప్పుడు వారి తమ్ముడు ప్రదీప్‌రావు దవాఖానలో దగ్గరుండి అన్నీ చూసుకున్నారని తెలిపింది. వైద్యం కోసం రూ. 8 లక్షల వరకు ఖర్చు అయిందని, ప్రభుత్వం స్పందించి వైద్యకోసం చేసిన అప్పులను తీర్చి ఆదుకోవాలని కోరింది.

అర్హులను విస్మరించడంతోనే ఆత్మహత్య: ఎర్రబెల్లి

ప్రజాపాలన పేర గ్రామసభలు పెట్టి అర్హులను విస్మరించడంతోనే కుమ్మరి నాగేశ్వర్‌రావు ఆత్మహత్య చేసుకున్నాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నాగేశ్వరరావు మృతి ఈ అసమర్థ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. గ్రామసభలో అధికారులు చదివిన లిస్టులో తనపేరు లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తంచేశారు.

సంక్షేమ పథకాల పేరుతో ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వం: పెద్ది సుదర్శన్‌రెడ్డి

దళిత బిడ్డ కుమ్మరి నాగేశ్వర్‌రావు మృతికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎంజీఎంలో మృతదేహాన్ని సందర్శించి, నాగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో రేవంత్ సర్కారు పేదల ప్రాణాలు తీస్తున్నదని మండిపడ్డారు. నాగయ్య ప్రాణాలు కాపాడేందుకు ములుగు జిల్లా బీఆర్ఎస్ నాయకులు ఎంతో ప్రయత్నించారని, దురదృష్టవశాత్తు ఆయన ప్రాణాలు వదలడం బాధాకరమని తెలిపారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని, నమ్మి ఓటు వేసినందుకు నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ పార్టీపై కొట్లాడాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని, ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరారు.

నెలన్నరలో మొదలుపెట్టకపోతే 'ఇల్లు' రద్దు!

- ఇందిరమ్మ ఇండ్ల పథకంలో సర్కారు షరతు
- సమయానికి డబ్బులు లేక లబ్ధిదారుల ఆందోళన

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిబంధనలతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మంజూరైన 45 రోజుల్లోగా నిర్మాణం ప్రారంభం కాకుంటే ఇల్లు రద్దవుతుందని షరతు విధించడంతో లబోదిబోమంటున్నారు. ఉన్నఫలంగా డబ్బులు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలో అర్థంకాక ఆవేదన చెందుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుందా? ఇస్తే ఎప్పటిలోగా ఇస్తుంది? అనేది స్పష్టత లేదు. తీరా అప్పోసప్పో చేసుకొని ఇంటి నిర్మాణం చేపట్టాక ప్రభుత్వం నుంచి నిధులు రావడం ఆలస్యమైతే ఏమిచేయాలో అర్థంకాక వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం విధించిన షరతుతో లబ్ధిదారులకు ఇల్లు మంజూరైందనే ఆనందం కూడా లేకుండా పోయింది.

షరతు పేరిట కొర్రీలు

ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటిదశలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కొన్ని గ్రామాల్లో కొందరు లబ్ధిదారులను ఎంపిక చేసి, మంజూరు పత్రాలు పంపిణీ చేసింది. పునాదులు నిర్మించిన తర్వాత లక్ష, స్లాబు పడ్డాక 2 లక్షలు, మిగిలిన పనులు పూర్తయ్యాక మరో 2 లక్షలు విడుదల చేస్తామని పేర్కొంది. కానీ మంజూరు పత్రాలు అందిన 45 రోజుల్లోగా నిర్మాణం ప్రారంభించకపోతే ఇల్లు రద్దు చేస్తామని అధికారులు చెప్తున్నారు. ఈ నిబంధనలే పేదల పాలిట శాపంగా మారాయి. పునాది వరకు నిర్మించేందుకు కనీసం రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. నిరుపేదలు ఇంత భారీ మొత్తాన్ని సమకూర్చుకోవడం కష్టంతో కూడుకున్న పని. ఇప్పటికిప్పుడు అప్పుపుట్టక పోవడంతో ఇల్లు రద్దవుతుందేమోనని చాలామంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

తర్వాత ఇవ్వకపోతే ఏంటి గతీ!

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనతో అనుబంధంగా రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి 20 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. కానీ ఎన్ని ఇండ్లు మంజూరు చేస్తుందో, ఎన్ని నిధులు ఇస్తుందో ఢిల్లీ పెద్దల నుంచి స్పష్టతలేదు. ఒకవేళ కేంద్రం ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే లబ్ధిదారులందరికీ మొత్తం 5లక్షలు ఇస్తుందా? అని లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు.

కాంగ్రెస్ పాలన భస్మాసుర హస్తం!

- నా చావుతోనైనా అర్హులకు పథకాలు ఇవ్వాలని పురుగుమందు తాగిన నాగయ్య
- దవాఖానలో చికిత్స పొందుతూ మృతి
- రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజల పాలిట అభయహస్తం కాదని, భస్మాసుర హస్తమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదని గ్రామసభలో పురుగులమందు తాగిన ములుగు జిల్లా బుట్టాయిగూడెంకు చెందిన కుమ్మరి నాగయ్య (నాగేశ్వర్‌రావు) దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. నాగయ్యకు మంచి వైద్యం అందించి, ప్రాణాలు కాపాడేందుకు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఎంతో ప్రయత్నించిందని, కానీ దురదృష్టవశాత్తూ నాగయ్య ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. తన చావుతోనైనా అర్హులైన పేదలకు పథకాలు ఇవ్వాలని అధికారులకు చెప్తూ పురుగుల మందు తాగి, దవాఖాన పాలైన నాగయ్య దుస్థితికి ప్రభుత్వమే కారణమని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని మండిపడ్డారు.

ఎన్నికల్లో లబ్ధి పొందాలనే యావ

పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే యావతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరపకుండా, జాబితా విడుదల చేసి ప్రజల్లో గందరగోళం సృష్టించిందని హరీశ్‌రావు మండిపడ్డారు. దరఖాస్తుల పేరిట దగా చేయడం తప్ప, ఏడాది పాలనలో కాంగ్రెస్ సర్కారు ఏం చేసిందని ప్రశ్నించారు. 'రోడ్డునపడ్డ నాగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నా. రాష్ట్ర ప్రజలారా.. ఆత్మహత్యలు పరిష్కారం కాదు. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ పార్టీపై కొట్లాడుదాం. హక్కుగా రావాల్సిన పథకాలను సాధించుకుందాం. బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది. ధైర్యం కోల్పోవద్దు, ఆత్మహత్యలకు పాల్పడవద్దు' అని రాష్ట్ర ప్రజలకు హరీశ్‌రావు సూచించారు.

విద్యార్థులకు సరైన అన్నం పెట్టరా?

విద్యార్థులకు సరైన భోజనం కూడా అందించలేరా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు కడిగిపారేశారు. తమ పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని తల్లిదండ్రులు రోడ్డెక్కాల్సిన దుస్థితి సాక్షాత్తు సీఎం నియోజకవర్గంలోనే చోటుచేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని తీరు ఎలా ఉన్నదో కోస్గి ప్రభుత్వ పాఠశాల దుస్థితి చూస్తే తెలిసిపోతుంది' అని గురువారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఈ మేరకు ఓ పత్రికలో వచ్చిన వార్త క్లిప్‌ను ట్వీట్‌కు జతచేశారు.

రాష్ట్రాలకు తగ్గుతున్న ఆదాయం

కేంద్ర సెస్‌లు, సర్ చార్జీల పెరుగుదలపై మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. 2013-14లో కేంద్ర సెస్‌లు, సర్ చార్జీలు రూ.1.08 లక్షల కోట్లు అని, అది ప్రస్తుతం రూ.5.56 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. స్థూల పన్ను ఆదాయంలో ఇది 6.53 శాతం నుంచి 10.97 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు. కేంద్రం వైఖరితో రాష్ట్రాలకు ఆదాయం గణనీయంగా తగ్గుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు సెస్‌లు, సర్ ఛార్జీలపై కేంద్రం పునఃసమీక్షించాలని కోరారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

- బాలానగర్‌లోని బాలికల గురుకులంలో ఘటన

ఆరాధ్య (ఫైల్)

బాలానగర్, ఫిబ్రవరి 6 : గురుకుల పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం చోటుచేసుకున్నది. పాఠశాల ఉపాధ్యాయుల కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కన్నపల్లికి చెందిన ఆరాధ్య (15) బాలానగర్ మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. గురువారం తెల్లవారుజామున 5:30 గంటల వరకు స్టడీ అవర్‌లో తోటి విద్యార్థినులతో కలిసి చదువుకున్నది. తర్వాత విద్యార్థినులంతా స్నానాలకు వెళ్లగా.. ఆమె కూడా బకెట్ తీసుకొని వెళ్లింది. బకెట్ బాత్రూం బయటే వదిలేసి సమీపంలో ఉన్న చీర తీసుకొని 6:30 గంటల ప్రాంతంలో ఏడో తరగతి గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పుస్తకాల కోసం తరగతి గదిలోకి వెళ్లిన విద్యార్థులు గమనించి ప్రిన్సిపాల్ అంజన్‌రెడ్డితోపాటు ఉపాధ్యాయులకు తెలిపారు. వారు వెంటనే బాలికను షాద్‌నగర్ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకొన్న ఏబీవీపీ నాయకులు పాఠశాల వద్దకు చేరుకొని గేటు ఎదుట ఆందోళనకు దిగారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, డీఈవో ప్రవీణ్ గురుకులానికి చేరుకొని బాలిక తల్లిదండ్రులు రమేశ్, రజిత, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలని, రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని బంధువులు డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లెనిన్ తెలిపారు.

ఉరివేసుకొని ఏఆర్ ఎస్సై ఆత్మహత్య

- కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణం
- మృతుడు 15వ బెటాలియన్‌లో ఏఆర్ఎస్సై

లక్ష్మీనర్సు (ఫైల్)

గోవిందరావుపేట, ఫిబ్రవరి 6: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఏఆర్ ఎస్సై సూర్నపాక లక్ష్మీనర్సు(37) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రాలో చోటు చేసుకుంది. పస్రా ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనర్సు, ఆయన భార్య వినోద పదేళ్లుగా పస్రాలో నివాసం ఉంటున్నారు. లక్ష్మీనర్సు ఏడూళ్ల బయ్యారంలోని 15వ బెటాలియన్‌లో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తుండగా భార్య వినోద మేడారంలోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నది. బుధవారం ఉదయం లక్ష్మీనర్సు గుండాలలో నివసిస్తున్న అక్క దగ్గరికి భార్యాపిల్లలతో కలిసి వెళ్లాడు. అక్కడ ఫంక్షన్‌లో భార్యాభర్తల మధ్య చిన్న లొల్లి జరిగింది. అదే రోజు రాత్రి 9గంటల సమయంలో ఇంటికి రాగా మళ్లీ గొడవ జరిగింది. దీంతో ఏఆర్ఎస్సై భార్యను రూమ్‌లో నుంచి బయటకు నెట్టేసి తలుపు గడియ పెట్టుకున్నారు. మరో గదిలో ఇద్దరు పిల్లలు నిద్రపోయారు. గురువారం ఉదయం పిల్లలు లేచి తండ్రిని పిలువగా తలుపులు తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన పిల్లలు కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉండటాన్ని గుర్తించారు. మృతుడి తండ్రి ధర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

అందరికీ అందుబాటులోకి చాట్‌జీపీటీ సెర్చ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: సెర్చ్ ఇంజిన్ గూగుల్‌కు పోటీగా తీసుకొచ్చిన 'చాట్‌జీపీటీ సెర్చ్' ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చింది. 'సైన్ ఇన్' అవసరం లేకుండా..'చాట్‌జీపీటీ సెర్చ్' ఫీచర్‌ను అందరూ ఉపయోగించుకోవచ్చునని 'ఓపెన్ఏఐ' తాజాగా వెల్లడించింది. నిన్నటి వరకు చాట్‌జీపీటీ సేవలు పొందేందుకు గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ ఖాతా ద్వారా 'సైన్ ఇన్' కావాల్సిందే. ఇప్పుడా అవసరం లేకుండా 'చాట్‌జీపీటీ డాట్ కామ్'లోకి వెళ్లి, మనం కోరుకున్న అంశాన్ని సెర్చ్ చేయవచ్చునని 'ఓపెన్ ఏఐ' వర్గాలు తెలిపాయి. దీనిపై కంపెనీ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ సోషల్‌మీడియా 'ఎక్స్'లో సరదాగా స్పందిస్తూ, 'మేక్ సెర్చ్ గ్రేట్ అగేయిన్' అన్న సందేశాన్ని పోస్ట్ చేశారు.

'నమస్తే' పేరుతో నకిలీ వార్తలు

- అధికార పార్టీ సోషల్ మీడియా పైశాచికం
- కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ లక్ష్యంగా తప్పుడు వార్తల సృష్టి
- వ్యక్తిత్వాన్ని కించపరిచేలా శీర్షికలతో క్లిప్పింగ్‌ల తయారీ
- నమస్తే తెలంగాణతోపాటు ఇతర పత్రికల లోగోల వినియోగం
- విస్తృతంగా సోషల్ మీడియాలో ప్రచారం
- పోస్ట్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్న బీఆర్ఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): కుదిరితే బట్ట కాల్చి మీద వెయ్యాలే.. లేకుంటే పరువు తీసి బజారుకు ఈడ్చాలే.. ఇది బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ఆడుతున్న వికృత క్రీడ. ఇందుకు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నది. 'నమస్తే తెలంగాణ' పత్రిక, ఇతర పత్రికల లోగోలతో తప్పుడు వార్తలు సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నది. 'కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే ప్రళయమే'.. ఇలా రకరకాల తప్పుడు వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రయత్నిస్తున్నది. ఈ వికృత క్రీడ వెనుక పెద్ద స్కెచ్ ఉన్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటం.. ఇదే సమయంలో బీఆర్ఎస్, కేసీఆర్‌పై ప్రజల్లో కొనసాగుతున్న అభిమానాన్ని తట్టుకోలేకనే అధికార పార్టీ ఈ వికృత క్రీడకు తెరలేపింది. అయితే ప్రభుత్వ అసమర్థ విధానాలు, పాలనా వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న 'నమస్తే తెలంగాణ' పత్రిక పేరుతోనే నకిలీ వార్తలు వ్యాప్తిచేస్తే ఎక్కువ మందికి చేరుతుందని అధికార పార్టీ భావిస్తున్నది. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ' పేరుతో తప్పుడు వార్తలను ప్రజల్లోకి చొప్పిస్తున్నది.

పోస్ట్ చేసినవారిపై చర్యలు

నకిలీ క్లిప్పింగ్‌లను సృష్టించిన వారిపై బీఆర్ఎస్ ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. దీంతో కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు బీఆర్ఎస్ సిద్ధం అవుతున్నది. ఈ క్లిప్పింగ్‌లను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినవారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్తున్నది.

ఎడ్‌సెట్, పీఈసెట్ షెడ్యూల్ విడుదల

- జూన్ 1న ఎడ్‌సెట్, జూన్ 11 నుంచి పీఈసెట్ పరీక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తేతెలంగాణ): తెలంగాణ టీజీ ఎడ్‌సెట్-25, టీజీ పీఈసెట్-25 నోటిఫికేషన్లను గురువారం విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి అధికారులు వివరాలు వెల్లడించారు. మార్చి10న ఎడ్‌సెట్ నోటిఫికేషన్, 12 నుంచి మే 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. జూన్ 1న ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే మార్చి 13న పీఈసెట్ నోటిఫికేషన్, 15 నుంచి మే 24వరకు దరఖాస్తులు, మే 30 వరకు అదనపు రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 11 నుంచి 14 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. వివరాల కోసం ఎడ్యుకేషన్, పీఈసెట్ వెబ్‌సైట్లలో సంప్రదించాలని సూచించారు.

కొమురయ్యకు 'మోడల్ స్కూల్స్' మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తేతెలంగాణ): కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానం నుంచి పోటీ చేస్తున్న ముల్క కొమురయ్యకు తెలంగాణ మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ మద్దతు ప్రకటించింది. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయనకు మద్దతివ్వాలని నిర్ణయించినట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు తెలిపారు.

అర్చక ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): మరికొందరు అర్చక ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. దేవాదాయ శాఖలో కారుణ్య నియామకాల ద్వారా పనిచేస్తున్న 122 మంది అర్చక ఉద్యోగులతోపాటు 2014నాటికి తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న మరో 107మందిని క్రమబద్ధీకరించి వారికి కూడా గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు ఇచ్చేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అంగీకరించారు. అంతేకాకుండా జీవో ప్రకారం 5625 మంది అర్చక ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు రావాల్సి ఉండగా, కేవలం 3000 మందికి మాత్రమే ఇస్తున్నట్టు అర్చక ఉద్యోగుల సంఘం పేర్కొంది. మిగిలిన వారికి కూడా వర్తింపజేసేందుకు సానుకూలత వ్యక్తం చేశారని వెల్లడించింది. గురువారం పలువురు అర్చక ఉద్యోగ సంఘం నాయకులు గంగు ఉపేంద్రశర్మ నేతృత్వంలో హైదరాబాద్‌లోని చేనేత భవన్‌లో దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి సమస్యలు వివరించారు. శైలజా రామయ్యర్ సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు.

కోస్గి మండలం నాచారం పాఠశాలలో విచారణ చేపడుతున్న అధికారులు

సీఎం ఇలాకాలో ఆకలి కేకలు

- పస్తులు ఉంచుతున్న ఉపాధ్యాయులు
- కోస్గి మండలం నాచారంలో టీచర్లకు వంట ఏజెన్సీకి మధ్య తగాదా
- భోజనం పెట్టకుండా దబాయింపు
- హెచ్ఎంపై డీఈవో సీరియస్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): /కోస్గి టౌన్ : సాక్షాత్తు సీఎం ఇలాకాలో విద్యార్థుల ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించకపోవడంతో పస్తులు ఉంటున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలం నాచారంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొన్ని రోజులుగా విద్యార్థులకు భోజనం సరిగ్గా పెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి